19 మండలాల్లో వర్షం


అనంతపురం అర్బన్, సెప్టెంబరు 8: జిల్లాలోని 19 మండలాల్లో శని వారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా గార్లదిన్నెలో 17.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కళ్యాణదుర్గం 13.4, వజ్రకరూరు 12.2, ఉరవకొండ 10.8, నార్పల 10.2, శింగనమల 9.6, యల్లనూరు 4.8, బుక్కరాయసముద్రం 4.2, రాప్తాడు 4.0, విడపనకల్లు 3.8, ఆత్మకూరు 3.2, కూడేరు 3.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 2.8 మి.మీల వర్షపాతం నమోదైంది.


గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ రోడ్డులో కాళికాదేవిపై నవధాన్యాలతో..


కమలానగర్‌లో విష్ణురూపంలో..

అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం,

భక్తుల కోలాహలం


హౌసింగ్‌బోర్డులో సిద్ధిబుద్ధి వినాయకుడు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 8: జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా వీధివీధినా బొజ్జ గణపయ్య కొలువై భక్త కోటికి కనువిందు చేశాడు. గణనాథుడిని కొలువుదీర్చేందుకు భక్తులు మండపాలను ఎంతో అందంగా అలంకరించారు. ఉదయమే కొలుదీర్చిన బొజ్జ గనపయ్యకు వివిధ పత్రాలు, పూలు సమర్పించి పూజలు చేశారు. ఉండ్రాళ్ల, చెరుకు గడలు వివిధ రకాల పిండి వంటలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తిగీతాలు పాడుతూ తన్మయత్వం చెందారు. రాత్రిపూట ఆయా మండపాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వాడవాడలా వినాయక చవితి వేడుకలు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా


పాతూరు రెడ్డివీధిలో సరస్వతీదేవి సప్తస్వరాల వినాయకుడు



వినాయకా..! విఘ్నాలు తొలగించు
కలెక్టరు ప్రత్యేక పూజ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 8: 'జిల్లా అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు ఎలాంటి అడ్డంకులు రాకుండా చూడు స్వామీ' అంటూ విఘ్నేశ్వరుడిని వేడుకున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సమీపంలోని కృష్ణ కళామందిరంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పండితులు ఆయన చేత గణనాథుడికి ప్రత్యేకంగా పూజలు చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ మారుతి, తహసీల్దార్లు రియాజుద్దీన్, వసంతలత, బ్రహ్మయ్య, మోహన్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సెక్రెటరీ, జేఏసీ చైర్మన్ దివాకర్ రావు, నారాయణస్వామి, సంజీవరెడ్డి, వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణకళా మందిర్‌లో పూజలు చేస్తున్న కలెక్టరు వినోద్ కుమార్


సప్తగిరి సర్కిల్‌లో ఉజ్జయిని మహా కాళేశ్వర్ జ్యోతిర్లింగ పురాణగాథను తెలిపే కథ రీతిలో..



వరదలో జగన్ బురద రాజకీయం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, సెప్టెంబరు 8: తనను ఓడించిన జనంపై కక్షతో మాజీ ముఖ్యమంత్రి జగన్ వరదలో బురద రాజకీయం చేస్తున్నాడని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. ఆయన తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనను ఓడించిన జనంపై కక్ష తీర్చుకోవడానికి వరదలను ఎంచుకోవడం జగన్ నీచరాజకీయానికి నిదర్శనమన్నారు. ఒక్క రూపాయి సాయం చేయకపోగా, ప్రభుత్వం చేసే సాయానికి సహకరించకుండా విమర్శలు చేస్తున్నాడని మండిపడ్డారు. బుడమేరు గట్ల పటిష్టత, ఆధునికీకరణ కోసం 2017-18లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా రూ. 220 కోట్లు మంజూరు చేశారన్నారు. బుడమేరు నుంచి 37 వేల క్యూసెక్కుల నీరు వచ్చినా వాటిని కృష్ణా నదిలోకి కలపడానికి చేపట్టిన పనుల్లో కొన్ని జరిగా యన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా నిలిపేశారన్నారు. ఈ విషయాన్ని అప్పటి ఆయన పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న వసంత కృష్ణప్రసాద్ బహిర్గతం చేశారన్నారు. ఈ బుడమేరు పాపం పూర్తిగా జగన్‌మోహన్‌రెడ్డి వైఫల్యమేనని ధ్వజమెత్తారు. గత పాలకుల పాపాలే విజయవాడ ప్రజలకు శాపాలుగా మారాయన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ



డీసీసీ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

ఉరవకొండ, సెప్టెంబరు 8: అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన వై. మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఏఐసీసీ నుంచి నియామక ఉత్తర్వులు శనివారం వెలువడ్డాయి. మధుసూదన్‌రెడ్డి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో పని చేశారు. ఈక్రమంలోనే 1982లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఆర్ట్స్ కళాశాల చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2009లో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం వైసీపీలో చేరి కొన్నేళ్లు పని చేశారు. ఆపార్టీ 2023లో సస్పెన్షన్ వేటు వేయడంతో కొన్ని రోజులు రాజకీయాలకు దూరమయ్యారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి ఉరవకొండ అభ్యర్థిగా 2024లో పోటీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు షర్మిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవడానికి కృషి చేస్తానన్నారు.

ఏంటో.. ఇదంతా..!


బదిలీలపై అయోమయం
15కి ముగియనున్న గడువు
ఏ శాఖలోనూ కనిపించని స్పష్టత
కీలకంగా మారిన కలెక్టరు నిర్ణయం

అనంతపురం టౌన్, ఆగస్టు 8: బదిలీలపై గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి అయోమయం కొనసాగుతోంది. ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గత ప్రభుత్వం లో ఉన్న అధికారులు, ఇతర ఉద్యోగులను మార్చుకోవడం ఆనవాయితీ. అయితే ప్రస్తుత టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఇంకా చాలా శాఖలలో అధికారులు, ఉద్యోగులను బదిలీ చేయలేదు. దీనివల్ల కొన్ని శాఖలలో సమస్యలు ఏర్పడుతున్నాయని భావించడంతో సీఎం చంద్రబాబు నాయుడు బదిలీలకు ఆమోదం తెలి పారు. ఆగస్టు 15నుంచి 31లోగా బదిలీల ప్రక్రియ ముగించాలని సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అది కూడా 16శాఖలకు మాత్రమే ఆ బదిలీలలో అవకాశం కల్పించారు. అయితే సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో బదిలీల ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో సెప్టెంబరు 15వరకు ఈబదిలీలకు గడువు పొడిగిస్తూ సీఎస్ మరోసారి ఉత్తర్వులు ఇచ్చారు.



ఒక్క శాఖలో కూడా కనిపించని క్లారిటీ

బదిలీలకు సంబంధించి ఇప్పటికీ ఒక్క శాఖలో కూడా క్లారిటీ కనిపించడం లేదు. సీఎస్ ఏమి ఉత్తర్వులు ఇచ్చారో? ఇక్కడ కలెక్టరు ఎలాంటి మార్గదర్శకాలు అమలు చేస్తున్నారో? ప్రజాప్రతినిధులు నుంచి ఎలాంటి సిఫార్సులు వస్తున్నాయో ఎవరికీ అర్థం కావడంలేదు. అత్యంత కీలకమైన రెవెన్యూ, జడ్పీ, పంచాయతీరాజ్‌శాఖలలో ఈగందరగోళం అధికంగా కొనసాగుతోంది. ఇప్పటికే జిల్లాస్థాయిలో జరిగే బదిలీలకు ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల నుంచి చాలామంది సిఫార్సు లేఖలు తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే ఈ విషయంలో కలెక్టరు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అర్థం కావడం లేదనే చర్చ ఉద్యోగుల్లో సాగు తోంది. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల బదిలీల విషయంలోను ఇదే గందర గోళం సాగుతోంది. జిల్లాలో అత్యంత కీలకమైన ఆర్డీఓలు, డీఆర్‌డీఏ, డ్వామా శాఖల పీడీలు, డీపీఓ, ఎస్ఎస్ఏ పీఓ అధికారుల నియామకంలోను అనేక రకాలుగా చర్చలు సాగుతున్నాయి. కానీ ఇప్పటికీ ఇందులో ఒక్క పోస్టుపై కూడా క్లారిటీ లేదు. ఈపోస్టులకు రాష్ట్రస్థాయిలో ఆయాశాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నియామకం జరిగి ఉంటే స్థానిక బదిలీలలో ప్రజా ప్రతినిధుల సిఫార్సులకు ప్రాధాన్యం ఉండేది. కొత్త అధికారులు రాకపోవడం తో ఈబదిలీల వ్యవహారంలో కలెక్టరు అత్యంత కీలకంగా మారిపోయాడు. ఆ కలెక్టరు నిర్ణయాలపైనే ఇపుడు అందరి దృష్టి ఉంది,



తహసీల్దార్ల తంటా ?

ఇప్పటికే జిల్లాలో తహసీల్దార్ల బదిలీల వ్యవహారంలో అసంతృప్తి కొనసాగుతోంది. కొంతమంది నియామకం విషయంలో కొందరు ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడుగురు తహసీల్దార్లు ఇప్పటికీ బదిలీ అయిన స్థానంలో చేరలేదు. మరికొంతమంది జాయిన్ అయినా వారిని మార్చాలని కొందరు ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నట్లు చర్చసాగుతోంది. దాదాపు రెండు నెలలుగా ఏడుగురు తహసీల్దార్లు త్రిశంకుస్వర్గంలో ఉంటూ వస్తున్నారు. ఆ ఏడుగురిలో మోహన్‌కుమార్ (కూడేరు), ఈశ్వరమ్మ(తాడిపత్రి), అలెగ్జాండర్ (రాయదుర్గం), షర్మిల (బెళుగుప్ప), వాణిశ్రీ(అనంతపురం రూరల్, ఉషారాణి(గుంతకల్లు ఆర్డీఓ ఆఫీ-స)కు పోస్టింగ్ ఇచ్చారు. ఈ ఏడుగురు అక్కడ జాయిన్ కాలేదు, మార్పులు చేర్పులు చేసి వీరిస్థానంలో కొత్తవారిని నియమిస్తారని అందరు అనుకుంటున్నారు. కానీ ఇప్పటికీ వారి స్థానంలో కొత్త వారిని నియమించలేదు. ఇందుకు కలెక్టరు వినోద్ కుమార్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈబదిలీలు కలెక్టరు, జిల్లా ప్రజా ప్రతినిధుల మధ్య కొంత దూరం పెంచాయన్న ప్రచారం జరుగుతోంది. ఈనెల 15లోగా బదిలీల ప్రక్రియ ముగియనుంది. ఈనెల 14న రెండో శనివారం, 15న ఆదివారం ఉంది. అంటే ఈనెల 13కల్లా ఈబదిలీల ప్రక్రియ ముగించాల్సి ఉంది.

రాచానపల్లి చెరువు



చెరువు స్థలంలో నిర్మాణాలు

తెలిసినా.. తెలియనట్లుగా..!

- చెరువు నిండటంతో ఆక్రమణ భూమిలోకి నీరు
- మరోమారు వర్షం వస్తే నిర్మాణాలు మునిగే ప్రమాదం
- చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు


చెరువు ఆక్రమణలపై చర్యలేవీ..!

ఆక్రమణలు వాస్తవమైనా చర్యలు శూన్యం..

చెరువు ఆక్రమించుకున్నారని తెలిసినా చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండింది. దీంతో నీరంతా ఆక్రమణకు గురైన భూమిలో చేరింది. ఆ నీటిని తిరిగి చెరువులోకి పంపేందుకు స్థానికంగా కట్టను కొంత తొలగించారు. మరో మారు ఓ మోస్తరు వర్షం కురిసినా స్థానికంగా నిర్మించుకున్న ఇళ్లు నీటమునిగే ప్రమాదం ఉంది. అయినా సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

-అనంతపురంరూరల్

అనంతపురంరూరల్ మండలం రాచానపల్లి గ్రామ సర్వే నెంబరు 86లో 13.94 ఎకరాల్లో చెరువు ఉంది. గత ప్రభుత్వ హయంలో గ్రామ ప్రజాప్రతినిధి భూమి చెరుకు అనుకుని ఉండటంతో ఎకరాకుపైగా ఆక్రమించారు. అందులో 50కి పైగా ప్లాట్లు వేసి ఇతరులకు విక్రయించినట్లు ఆయా వర్గాల ద్వారా తెలిసింది. ప్లాట్లు తీసుకున్న వారిలో కొందరు బండలు పాతుకుని హద్దు ఏర్పాటు చేసుకోగా..మరో ఇద్దరు ముగ్గురు ఏకంగా షెడ్డు, ఇంటి నిర్మాణాలు చేపట్టారు. చెరువు ఆక్రమణలను రెండు నెలల కిందట 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. ఆమేరకు ఇరిగేషన్ అధికారులు స్థానికంగా విచారణ జరిపారు. ఆ క్రమంలోనే రెవెన్యూ అధికారులు కూడా సర్వేయర్‌తో సర్వే చేయించారు. చెరువును ఆక్రమించినట్లు నిర్ధారణ జరిగింది. ఈక్రమంలో ఇంటి నిర్మాణాదారులు, స్థలాలు పొందినవారి నుంచి స్థలాలు ఎవరు ఇచ్చారు? ఇంటి నిర్మాణం ఎవరూ చేసుకోమన్నారు? వంటి విషయాలపై వివరాలు సేకరించారు. ఈక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధి స్థలాలు ఇచ్చినట్లు అధికారుల ఎదుట వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు నిర్మాణాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించారు. నెల రోజుల కిందట స్థానిక టీడీపీ నాయకులు చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కలిసి కోరారు. అయితే ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు.


ఇటీవల కురిసిన వర్షానికి ఆక్రమణ భూమిలో చేరిన చెరువు నీరు, ఆ నీటిని తిరిగి చెరువులోకి వెళ్లేందుకు తవ్వివన కట్ట



పొంచిఉన్న ప్రమాదం..

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండింది. ఈక్రమంలో చెరువుకు అనుకుని ఉన్న భూమిలో చెరువు నీరు చేరాయి. దీంతో ఆక్రమణకు గురైన చెరువు స్థలంలో పెద్ద ఎత్తున నీరు చేరింది. మరో మారు ఓ మోస్తరు వర్షం కురిసినా మరింతగా నీరు చేరే అవకాశం ఉంది. ఇదే జరిగితే స్థానికంగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న వారి పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది. దీని గురించి సంబంధిత అధికారులు ఆలోచించకపోవడం వారి పని తీరుకు అద్దం పడుతోంది.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

చెరువులో కొంత భాగం అక్రమణకు గురైంది. చెరువు గట్టుకు ఏర్పాటు చేసిన చెక్ డ్యాంను ధ్వంసం చేసి, పైపులు ఏర్పాటు చేశారు. వాటిని మూసివేసి పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువునీరు ఆక్రమణ భూమిలోకి వెళ్లడంతో ఆ నీరు దిగువకు వెళ్లేందుకు తాము మూసివేసిన పైపులైన్ తొలగించేశారు. దీంతో చెరువులో నీరంతా దిగువకు వెళ్లిపోయింది.

-కృష్ణకుమార్, ఏఈ ఇరిగేషన్

రాప్తాడును అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, సెప్టెంబరు 8: బోడమల్లయ్య స్వామి సాక్షిగా రాప్తాడును అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని గొళ్లపల్లి సమీపంలోని కురుబల ఆరాధ్య దైవం బోడమల్లయ్య స్వామి ఉపవాస దీక్ష విరమణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత గురవయ్యలకు పాలు పోసి ఉపవాస దీక్ష విరమింపజేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వరకూ రూ. 15లక్షలతో రోడ్డు నిర్మించామన్నారు. రూ. 2లక్షలతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. గతంలో దేవస్థానం వద్ద రూ. 5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనానికి రంగులు కూడా వేయించామన్నారు. రాప్తాడును అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న పరిటాల సునీత

బోడమల్లయ్య స్వామి


నేడు జిల్లాకు రానున్న క్రికెట్ జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: దులీప్‌ట్రోఫీలో భాగంగా సోమవారం ఇండియా-ఏ, ఇండియా-బీ జట్లు జిల్లాకు రానున్నాయి. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం బస చేయనున్నారు. మంగళవారం ఇరు జట్లు నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొననున్నాయి. ఈనెల 15 నుంచి ఏసీజీ-ఏ గ్రౌండ్‌లో ఇండియా-ఏ, ఇండియా-డీ జట్ల మధ్య పోటీ జరగనుంది. ఏసీజీ-బీ గ్రౌండ్‌లో ఇండియా-బీ, ఇండియా-సీ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ హీటర్ తగలి వృద్ధురాలి మృతి

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 8: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ హీటర్ తగిలి కుళ్లాయమ్మ (72) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వెంకటాపురం గ్రామానికి చెందిన కుళ్లాయమ్మ శనివారం ఉదయం స్నానం చేయడానికి వేడి నీటి కోసం ఇంట్లో ఉన్న కరెంటు హీటర్‌ను ఆన్‌చేసింది. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో హీటర్‌పై వృద్ధురాలి చేయి పడింది. విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతిచెందింది. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హత్య

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 8: భార్య కళావతి (31)ని భర్త గంగాధర్ క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. కళ్యాణదుర్గం రూరల్ గ్రామానికి చెందిన గంగాధర్ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బీ కొత్తపల్లి గ్రామానికి చెందిన కళావతిని ప్రేమవివాహ చేసుకుని గుజ్జల సరళాదేవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాలుగా గంగాధర్ మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. శనివారం ఆమె పుట్టింటికి వెళ్లి నిద్రిస్తున్న ఆమెను క్రికెట్ బ్యాట్‌తో తలపై కొట్టి హత్య చేశాడు. బుక్కరాయసముద్రం సీఐ కరణాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి వృద్ధుడి మృతి

గుత్తి, సెప్టెంబరు 8: గుత్తి జీఆర్పీ పరిధిలోని పాతకొత్తచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో రైలులో నుంచి పడి సాంబయ్య(73) మృతిచెందినట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప ఆదివారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి పట్టణానికి చెందిన సాంబయ్య.. కుటుంబ సభ్యులతో కలిసి రైలులో తిరుపతికి దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం రైలు పాతకొత్తచెరువు స్టేషన్ సమీపంలోకి రాగానే సాంబయ్య వాష్‌రూంకి వెళ్లి వచ్చే సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంబమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు...

ఇద్దరికి తీవ్రగాయాలు



సాయినాథ్ (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 8: మండలకేంద్రం సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. యాడికికి చెందిన సాయినాథ్ (25), ధర్మేంద్ర, లోకేశ్ స్నేహితులు. వీరు శనివారం ఒకే ద్విచక్రవాహనంలో రాయలచెరువుకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి యాడికికి బయలుదేరారు. యాడికి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని యాడికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత తాడిపత్రికి తరలించారు. సాయినాథ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించగా.. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

తండ్రికి చేదోడువాదోడుగా సాయినాథ్

సాయినాథ్ యాడికిలోనే డాబా నిర్వహించే తన తండ్రి లింగమయ్యకు చేదోడుగా ఉండేవాడు. లింగమయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సాయినాథ్ తండ్రికి చేదోడుగా ఉంటూ డాబా పనులు చూసుకునేవాడు. అతడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

మహాసమాధిని దర్శించుకున్న మాజీ క్రికెటర్లు



సత్యసాయి చిత్రపటాలతో మాజీ క్రికెటర్లు

పుట్టపర్తి, సెప్టెంబరు 8: మాజీ క్రికెటర్లు చేతన్‌శర్మ, అజయ్‌మల్హోత్రా, బీసీసీఐ మేనేజర్ అమిత్‌సిద్దేశ్వర్, రంజీ మాజీ క్రికెటర్ షాబుద్దీన్ ఆదివారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వినాయకచవితి సందర్భంగా ప్రశాంతినిలయం చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు విజయ్ వారికి సత్యసాయి చిత్రపటాలను అందజేసి, సన్మానించారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తా పడిన బస్సు

బత్తలపల్లి సెప్టెంబరు 8: మండలంలోని గుమ్మళ్లకుంట వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అనంతపురం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు శనివారం నల్లమాడకు వెళ్లింది. తిరిగి 30 మంది ప్రయాణికులతో వస్తుండగా బత్తలపల్లి మండలం గుమ్మళ్లకుంట వద్ద ఆ బస్సు అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి బోల్తాపడింది. అటుగా వెళ్తున్న వాహనాదారులు, రైతులు బస్సులోని వారిని బయటకు తీశారు. బస్సు డ్రైవర్ లక్ష్మయ్య, కండెక్టర్ రాజశేఖర్, పాముదుర్తికి చెందిన మంగమ్మ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. బత్తలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





గాయపడిన ప్రయాణికురాలు, కండక్టర్‌ను మోసుకొస్తున్న స్థానికులు

మురిసిన అనంత..

దులీప్ ట్రోఫీ మ్యాచ్‌తో అభిమానుల్లో ఆనందం

శ్రేయాస్ సేనపై రుతురాజ్ టీం గెలుపు

మానవ్‌సుతార్ ఆల్‌రౌండ్ షో



మ్యాచ్‌లోని ఓ దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: దులీప్ ట్రోఫీ మ్యాచ్‌తో అనంత మురిసింది. స్టార్ల సందడితో అభిమానుల్లో ఆనందం ఉప్పొంగింది. తొలి మ్యాచ్‌లో ఇండియా సీ జట్టు గెలుపొందింది. ఒకరోజు మిగిలివుండగానే మ్యాచ్ ముగిసింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన మానవ్ సుతార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



మొదటి ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైన ఇండియా డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 236 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 54 పరుగులు, దేవ్‌దత్ పడిక్కల్ 56, రికీ భుయ్ 44 రాణించారు. మిగతా బ్యాట్స్‌మెన్ నిరాశపరిచారు. మొదటి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్న అక్షర్ పటేల్ రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులకే ఔటయ్యాడు. ఇండియా సీ బౌలర్లలో మానవ్‌సుతార్ 7, వైశాక్ 2, అన్షుల్ కాంబోజ్ వికెట్ తీశారు.

రెండో ఇన్నింగ్స్‌లో రాణించిన ఇండియా సీ జట్టు

మొదటి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకే ఆలౌటైన ఇండియా సీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకుంది. రుతురాజ్ గైక్వాడ్ 46 పరుగులు, ఆర్యన్ జ్యూయెల్ 47, పటీదార్ 44, అభిషేక్ పొరెల్ 35, మానవ్‌సుతార్ 19 రాణించారు. దీంతో నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. ఇండియా డీ బౌలర్లలో శరాన్ష్ జైన్ 4 వికెట్లు, అర్షదీప్‌సింగ్, అక్షర్‌పటేల్ చెరో వికెట్ పడగొట్టారు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశానికి కెప్టెన్లు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది. వారి స్థానంలో ప్లేయర్లు మాట్లాడారు. కాగా ఇద్దరు కానిస్టేబుళ్ల ఓవరాక్షన్‌తో మ్యాచ్‌ను వీక్షించేందుకు వెళ్తున్న వీఐపీలు ఇబ్బందిపడ్డారు. ఇతర పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కబెట్టారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న క్రికెటర్లు

అభిమానుల సందడి

భారత ఆటగాళ్ల ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. దీంతో ఏసీజీ అభిమానులతో కిక్కిరిసింది. స్టార్ ప్లేయర్లను తమ కెమెరాల్లో బంధించారు. బీసీసీఐ ప్రతినిధి అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛోఫెర్రర్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి షాబుద్దీన్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ వసంతబాబు, పగడాల మల్లికార్జున, మెడికల్ టీం డాక్టర్ సుప్రజాచౌదరి తదితరులు మ్యాచ్‌ను వీక్షించారు.



యువత కేరింత..



మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకిస్తూ..



ఈలలు, అరుపులతో...



స్టేడియంలో డ్రమ్స్...



విదేశీ వనితలు..

నిధుల స్కాం..!

- డీసీఈబీ వేదికగా అక్రమాలు
- లేని అధికారులు ఉన్నట్లు ఉత్తర్వుల సృష్టి
- ఫేక్ వర్క్ ఆర్డర్లతో నిధుల దోపిడీ
- ఫిబ్రవరిలో జిల్లాకు డీఈఓ వరలక్ష్మి
- డిసెంబరులోనే వచ్చినట్లు నకిలీ వర్క్‌ఆర్డర్, బిల్స్
- రూ. 31. 80 లక్షల వర్క్ కోసం ఉత్తర్వుల తయారీ
- ఇద్దరు డీఈఓల్లో ఎవరికీ తెలియకుండా బురిడీ కొట్టించారా..?
- పాత డీఈఓ కాలంలో కొత్త డీఈఓ పేరున అక్రమాలు





జిల్లా విద్యాశాఖ, డీసీఈబీ కార్యాలయాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8: జిల్లా విద్యాశాఖలో ఇన్నాళ్లు...చిన్న చిన్న అక్రమాలే చూశాం. కానీ కనీవినీ ఎరుగని దారుణాలు ఒక్కటిక్కటిగా బయటపడుతున్నాయి. లేని అధికారులు ఉన్నట్లు.. నకిలీ ఫైళ్లు, రికార్డులు సృష్టించి పరీక్షల ఫీజుల నిధులను భోంచేస్తున్నారు. లక్షలాది రూపాయలు దోచేస్తున్నారు. విద్యాశాఖ పరిధిలోని జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) వేదికగా లక్షలాది రూపాయలు స్కాం సాగినట్లు స్పష్టమవుతోంది. పరీక్షల ప్రశ్నపత్రాల కోసం డబ్బులు కట్టిన వందలాది స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఇటు ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్ల కళ్లు గప్పి, సాక్షాత్తు విద్యాశాఖ డీఈఓ కళ్లకు గంతలు కట్టి దర్జాగా నిధులు భోంచేస్తున్నారు. 2023-2024 ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు(సీబీఏ ప్రశ్నపత్రాలు), ఓఎంఆర్ షీట్స్ ముద్రణలో చేసిన అక్రమాలు భారీగానే బయటపడుతున్నాయి. 2023 డిసెంబర్‌లో ఒకరు డీఈఓగా ఉన్నారు. ఫిబ్రవరిలో డీఈఓగా మరో అధికారి వచ్చారు. ఫిబ్రవరిలో వచ్చిన కొత్త డీఈఓ పేరుపై డిసెంబరులో ఈ వర్కు ఆర్డర్, ఇతర సర్టిఫికెట్లు ఉత్తర్వులు సృష్టించింది. ఈ బాగోతంలో లక్షలాది రూపాయలు గోల్‌మాల్ సాగినట్లు తేటతెల్లమవుతోంది.

డీసీఈబీ ద్వారా ముద్రణ

జిల్లావ్యాప్తంగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ అన్ని యాజమాన్య విద్యార్థులకు (ప్రైవేట్ ప్రైమరీ విద్యార్థులు మినహా) అందరికీ 2023-24 విద్యా ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రించి పంపిణీ చేసే వర్కులో భారీగానే అక్రమాలు జరిగినట్లు స్పష్టమవుతోంది. ఏకంగా ఫేక్ ఉత్తర్వులు సృష్టించారంటే ఏ స్థాయిలో జరిగిందో ఇక చెప్పనక్కరలేదు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థుల నుంచి ప్రశ్నపత్రాల కోసం ఫీజులు వసూలు చేసి, డీసీఈబీ వద్ద జమ చేస్తారు. తర్వాత ప్రైవేట్ ప్రింటర్ల వద్ద ప్రశ్నపత్రాలు ముద్రణ చేసి, స్కూళ్లకు సప్లై చేస్తారు. 2023-24 ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్‌షీట్స్ ముద్రణలో భారీగా అక్రమాలు జరిగాయి. అనంతపురం జిల్లాలోని 31 మండలాలకు ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ)-3 ప్రశ్నపత్రాలు ముద్రించి సరఫరా చేయడానికి చీరాలలోని కేకే ప్రింటర్స్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. అదేవిధంగా 31 మండలాలకు సరఫరా ఓఎంఆర్ షీట్స్ కూడా ముద్రణ చేసి సరఫరా చేయడానికి వర్క్ ఆర్డర్‌ను తెనాలిలోని కమలా ప్రింటర్స్‌కు ఇచ్చారు. ఈ మేరకు నకిలీ వర్క్ ఆర్డర్లు, బిల్స్ సృష్టించారు. ప్రశ్నపత్రాలు ముద్రణ సప్లై చేసినందుకు చీరాలకు చెందిన కేకే ప్రింటర్స్‌కు రూ. 24,99,541, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ చేసి సప్లై చేసినందుకు తెనాలిలోని కమల ఆర్ట్స్ ప్రింటర్స్‌కు రూ. 6,80,416 చెల్లించేలా వర్క్‌ఆర్డర్ సృష్టించారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ కోసం రెండు ప్రింటింగ్ ప్రెస్‌లకు రూ. 31.80 లక్షలకుపైగా చెల్లించేలా ఉత్తర్వులు సృష్టించారు.

లేని డీఈఓ ఉన్నట్లు..

జిల్లా సాధారణ పరీక్షల మండలి(డీసీఈబీ)కి జిల్లా విద్యాశాఖాధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డీసీఈబీకి కార్యదర్శి ఒకరు ఉంటారు. ఎవరైనా ఒక ప్రధానోపాధ్యాయుడిని డీసీఈబీ కార్యదర్శిగా డీఈఓ ఎంపిక చేశారు. అయితే డీసీఈబీకి చైర్మన్‌గా ఉండే డీఈఓ సంతకాలు చేస్తేనే ఎలాంటి ఉత్తర్వులైనా, బిల్లులైనా పాస్ అవుతాయి. ప్రశ్నపత్రాల ముద్రణ, బిల్లుల చెల్లింపు జరగాలంటే డీసీఈబీకి చైర్మన్‌గా వ్యవహరించే డీఈఓ సంతకాలు కీలకం. అయితే 2023-2024 ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్-షీట్స్ ముద్రణకు సంబంధించిన వర్క్ ఆర్డర్‌ను కొందరు డీసీఈబీలోని కొందరు అధికారులు నకిలీ సృష్టించారు. డీఈఓ వరలక్ష్మి జిల్లాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 6 తేదీ జీవో నెంబర్ 46 విడుదల చేస్తూ డీఈఓలను నియమించారు. ఫిబ్రవరి 6న డీఈఓల నియామక జీవో రాగా వరలక్ష్మి ఫిబ్రవరి 10వ తేదీ అనంతపురం డీఈఓగా విధుల్లో చేశారు. అయితే ఆమె డిసెంబరులోనే ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణకు, సప్లైకు సంబంధించిన ఉత్తర్వులిచ్చినట్లు డీసీఈబీ అధికారులు సృష్టించడం మైండ్ బ్లాంక్ చేస్తోంది.

అక్రమాలు ఇలా...

డీఈఓ వరలక్ష్మి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ విధుల్లో చేశారు. అయితే ఆమె 2023 డిసెంబరు 15వ తేదీనే ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ, సప్లైకు సంబంధించిన వర్క్ ఆర్డర్స్‌ను సృష్టించారు. అంతేకాకుండా క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్లు కూడా తయారుచేశారు. వీటిని డీఈఓ వరలక్ష్మి పేరు మీద తయారు చేయడం, ఆమె సంతకాలు కూడా లేకుండా కేవలం ఉత్తర్వులు డీసీఈబీ ఉన్నతాధికారులు సంతకాలు పెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఫిబ్రవరిలో డీఈఓగా వరలక్ష్మి వస్తే ఆమె డిసెంబరులోనే వచ్చినట్లు ఫేక్ ఉత్తర్వులు రెడీ చేయడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఏకంగా రూ. 31. 80 లక్షల వర్క్స్ ఉత్తర్వులను ఇలా నకిలీవి సృష్టించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. డీఈఓ వరలక్ష్మి రాక ముందు వరకూ జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రస్తుతం సమగ్రశిక్ష ఏపీసీగా పనిచేస్తున్న నాగరాజు వ్యవహరించారు. అయితే ఆయన ఉన్నప్పుడు ఆయనకు తెలియకుండా డిసెంబరు 15వ తేదీన ఈ నకిలీ వర్క్ ఉత్తర్వులు సృష్టించారా....? లేక ప్రస్తుత డీఈఓ వచ్చాక చేశారా..? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తంగా ఏకంగా 31.80 లక్షల వర్కులకు సంబంధించి ఉన్నతాధికారులకు తెలియకుండా ఈ బాగోతాన్ని నడిపినట్లు స్పష్టమవుతోంది. అయితే డీసీఈబీలో ఈ స్కాంతో పాటు, ఇతర పనుల కోసం కూడా పెద్ద ఎత్తున ఫీజుల డబ్బులను భారీగానే గోల్‌మాల్ సాగినట్లు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ లేదా, విద్యాశాఖ కమిషనర్ విచారణ చేయిస్తే...ఈ నకిలీ ఉత్తర్వులు సృష్టించిన అక్రమాలుతోపాటు, వారి అక్రమాలు కూడా వెలుగుచూసే అవకాశం ఉంది.

పశువుల సంత ఆదాయం రూ.3.24లక్షలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,24,610 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మీ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,89,410, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,35,200 వచ్చిందని తెలిపారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, సెప్టెంబరు 8: కక్కలపల్లి ట మోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 3వేల టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 8: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్కులుగా ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో ఫేజ్-2కు 932 క్యూసెక్కులు, మరువ నుంచి 54 క్యూసెక్కులు వెళ్తున్నట్లు వెల్లడించారు.

నేటి నుంచి ఐసెట్ వెబ్ ఆప్షన్లు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 8: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు పొందేందుకు సోమవారం నుంచి ద్వితీయ కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రథమ కౌన్సెలింగ్ పూర్తి అయింది. అయితే మిగిలిన సీట్లను భర్తీచేసేందుకు ద్వితీయ కౌన్సెలింగ్ ద్వారా 4 నుంచి రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు, ప్రథమ కౌన్సెలింగ్ ద్వారా నచ్చిన కళాశాలలు దక్కని విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తిచేసుకున్న విద్యార్థులకు 17న సీట్లు కేటాయించనున్నారు.

విజయవాడకు తరలిన అనంత ఉద్యోగులు


అనంపురం టౌన్, సెప్టెంబరు 8: వరద సహాయక చర్యలు చేపట్టడానికి జిల్లా నుంచి పలువురు ఉద్యోగులు విజయవాడ తరలివెళ్లారు. 19 మంది తహసీల్దార్లు, 60మంది డిప్యూటీ తహసీల్దార్లు, 60 మంది సీనియర్ అసిస్టెంట్లు, 20మంది రీసర్వే డీటీలను వరద సహాయక చర్యల విధులకు నియమించారు. ఆ మేరకు రెవెన్యూశాఖ అధికారులు, ఉద్యోగులు శనివారం రాత్రి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు బయలుదేరి వెళ్లారని డీఆర్ఓ రామకృష్ణారెడ్డి తెలిపారు.

రాయచూరు ప్యాసింజరు రెండు రోజులు రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 8: నిర్వహణ కారణాల వల్ల గుంతకల్లు-రాయచూరు డెము ప్యాసింజరు (నెం. 07799/07800) రైలును రెండు రోజులపాటు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-రాయచూరు (07799) డెము ప్యాసింజరును ఈ నెల 9, 10 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07800)ను 10, 11 తేదీల్లో రద్దుచేసినట్లు అధికారులు తెలియజేశారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

సిద్దేశ్వరంతోనే రాయలసీమకు సాగునీరు

సిద్దేశ్వరం సీమపాట ఆవిష్కరణ సభలో వక్తలు



సీడీని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 8: సిద్దేశ్వర ప్రాజెక్టు నిర్మాణంతోనే రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో జలసాధన సమితి, రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ సంయుక్తాధ్వర్యంలో ప్రజాగాయకుడు డాక్టర్ సిగిలిరేవు రామాంజనేయులు రచించి, పాడిన 'సిద్దేశ్వరం' రాయలసీమ పాట ఆవిష్కరణ సభ నిర్వహించారు. జలవనరులశాఖ రిటైర్డ్ ఇంజనీర్ పాణ్యం సుబ్రహ్మణ్యంస్వామి.. సిద్దేశ్వరం పాట సీడీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... సీమ ప్రజలకు సాగునీటి అవసరాలు, ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు మరెన్నో జరగాలన్నారు. సీమ ప్రజా సంకల్పాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి, సిద్దేశ్వరం ప్రాజెక్టును నిర్మించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అనంతరం కళాకారులు జానపద గేయాలతో అలరించారు. కార్యక్రమంలో రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి, జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక బాషా, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, జెన్నె ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా సీనియర్ జట్టుకు వినయ్‌కుమార్

కోచ్‌గా ప్రసాద్‌రెడ్డి



వినయ్‌కుమార్



ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సీనియర్ జట్టుకు జిల్లాకు చెందిన ప్లేయర్ వినయ్‌కుమార్ సెలెక్ట్ అయ్యాడు. ఈనెల 9వతేదీ నుంచి 27వతేదీ వరకు బెంగుళూరులో కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీకి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర జట్టు తరఫున వినయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తాడు. జిల్లాకు చెందిన సీనియర్ ప్లేయర్, మాజీ రంజీ ఆటగాడు ఆర్ఎస్ ప్రసాద్‌రెడ్డి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. వినయ్‌కుమార్, ప్రసాద్‌రెడ్డిలకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి అభినందనలు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు, సెప్టెంబరు 8: మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వా మి ఆలయంలో ఆదివారం ప్ర త్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జిల్లా నలుమూలల నుం చి వందలాదిమంది భక్తులు త రలివచ్చి స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం స్వామి కల్యాణోత్సం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వా హణాధికారి అక్కిరెడ్డి తెలిపారు.

జిల్లాకు చేరుకున్న ఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8: జిల్లా ఎస్పీ జగదీష్ ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. విజయవాడలో వరదల నేపథ్యంలో ఆయన సహాయక చర్యల్లో పాల్గొనడానికి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో మూడు రోజులు అక్కడే ఉండి ఆదివారం నగరానికి వచ్చారు. పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8: నగరంలో సోమవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరపాలిక ఎస్ఈ సూర్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. నగర ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కోరారు.

యువకుడి అదృశ్యం



చంద్రశేఖర్ (ఫైల్)

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8 : పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మేడిమాకులప ల్లికి చెందిన వెంకటరామిరెడ్డి కుమారుడు మూలింటి చంద్రశేఖర్ శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడు ఆదివారం మధ్యాహ్నం ఇంటికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. చంద్రశేఖర్ అదృశ్యంపై కుటుంబసభ్యులు పెద్దవడుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెనకచెర్లలో మహిళ...



అనిత (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 8: మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన అనిత అనే వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పెనకచెర్ల గ్రామానికి చెందిన బోయ నరేష్, అనిత వ్యవసాయ పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. అయితే నరేష్ మద్యానికి అల వాటు పడడంతో వారిద్దరు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలోనే ఈ నెల 5వ తేది రాత్రి అనిత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అనిత కోసం భర్త నరేష్, కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె ఆచూకీ కనిపించకపోవడంతో రెండు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్త నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం చేయండి

గార్లదిన్నె, సెప్టెంబరు 8: గణేశ్ నిమజ్జనాన్ని శాంతియుత వాతావరణంలో పూర్తి చేయాలని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహకులకు సీఐ కౌలుట్లయ్య సూచించారు. ఆయన ఆదివారం సాయంత్రం ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌తో కలసి పలు గ్రామాల్లో పర్యటించి, గణేష్ విగ్రహాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా సుమారు 198 వరకు గణేష్ మండపాలు ఏర్పాటు చేశారన్నారు. సోమవారం నిమజ్జనం సందర్భంగా గ్రామాల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అనుకూలమైన ప్రాంతాల్లో నిమజ్జం చేయాలని సూచించారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 8: అక్షరాస్యతతోనే వ్యక్తిగత అభివృద్ధి సాధ్యమని ఆ దిశగా గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను నిర్మూలించాల్సిన అవసరముందని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురష్కరించుకుని ఆదివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఇళ్ల వద్దకెళ్లి ప్రజలకు అక్షరాస్యత వల్ల కలిగే లాభాలపై విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి దీపాంకర్‌తోపాటు వలంటీర్లు పాల్గొన్నారు.

'నరహంతకులను ఉరితీయాలి'

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 8: అమాయకుల ప్రాణాలు హరిస్తున్న నరహం తకులను ఉరితీయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. హత్యకు గురైన విద్యార్థి సరిత మృతదేహా న్ని ఆదివారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పోస్టుమార్టంలో పరిశీలించారు. సరితను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగరాజు, ఈశ్వరయ్య, నాగన్న, ముత్యాలప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామగిరి, సెప్టెంబరు 8: మండల పరిదిలోని పాపిరెడ్డిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని ఎంసీపల్లి నుంచి సుబ్బరాయుడు, గోవిందు ద్విచక్రవాహనంలో ఎన్ఎస్‌గేటుకు వైపు వెళ్తున్నారు. అయితే పాపిరెడ్డిపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళ్తున్న సుబ్బరాయుడు (37) అక్కడికక్కడే మృతిచెందగా గోవిందుకు తీవ్ర గాయాలయ్యాయి. గోవిందును ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి 108వాహనంలో తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సఅనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న రామగిరి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



వేణుగోపాల్‌నగర్ సాయినాథ మందిరంలో వెంకటేశ్వరస్వామి



సామూహిక ఏడుశనివారాల వ్రతం ఆచరిస్తున్న భక్తులు

ఘనంగా ఏడు శనివారాల వ్రతం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 8: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం ఏడుశనివారాల వ్రతాన్ని కనులపండువగా నిర్వహించారు. ఏడు శనివారాల్లో అనివార్య కారణాలవల్ల పాల్గొనలేని మహిళలు కోసం 8వ వారం వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో వేణుగోపాల్ నగర్ సద్గురు సాయినాథ మందిరం, ఆర్ఎఫ్ రోడ్డు, రామ్‌నగర్, హౌసింగ్‌బోర్డుల్లోని వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఎనిమిదో శనివారం వ్రతాన్ని భక్తులు సామూహికంగా ఆచరించి ముగించారు.

జేఎల్ మురళికి సన్మానం



జేఎల్ మురళీధర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: దివాలాకు చేరువలో ఉన్న అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును రూ.70కోట్ల నుంచి రూ.780కోట్లకు అభివృద్ధి చేసిన చైర్మన్ జేఎల్ మురళీధర్ కృషి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. కర్ణాటకలోని హోసూరులో ఉన్న ఏసియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్‌కు ఆదివారం స్థానిక రామ్‌నగర్‌లోని ఎస్ ఆర్ గ్రాండ్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం జేఎల్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రమణ్యం, జనసేన రాష్ట్ర కార్యదర్శి భవాని రవికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్‌మురళి, నాయకులు సుధాకర్ నాయుడు, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ను ఎంపిక చేశారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కళ్యాణ దుర్గం రోడ్డులోని ఆర్‌కే చెస్ అకాడమీలో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ చాంపియన్ షిప్- 2024 పోటీలు నిర్వహించారు. అండర్-9 ఓపెన్ బాలుర విభాగంలో సాకేత్, హేమచరణ్ రెడ్డి, సంజయ్ సాహల్... బాలికల విభాగంలో షోరోన్ బ్లెస్సీ, హారికచౌదరి, దివ్య విజేతలుగా నిలిచారు. విజేతలకు ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, టోర్నీ డైరెక్టర్ కిషోర్‌కుమార్, నేషనల్ ఆర్బిటార్ కమల్, కోచ్ హుస్సేన్‌ఖాన్ చేతలు మీదుగా బహుమతులు అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21, 22వతేదీలలో విజయనగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఉదయ్ కుమార్‌నాయుడు తెలిపారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 8: రామగిరి మండలంలోని పేరూరు మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు దాత భాస్కర్ క్రీడాపరికరాలను వితరణ చేశారు. మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన టీడీపీ గాండ్లసాధికర సమితి సభ్యుడు గార్లదిన్నె భాస్కర్ రూ.10వేలు విలువ చేసే క్రీడాసామగ్రిని పాఠశాల పీఈటీ చంద్రకళకు అందజేశారు. దాతను పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ధ్వజస్తంభంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

రాప్తాడు, సెప్టెంబరు 8: మండలంలోని గొల్లపల్లి సమీపాన గల బోడమల్లయ్యస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభంపై నుంచి పడిన వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. రాప్తాడుకు చెందిన ధనుంజయ ఆదివారం బోడమల్లయ్యస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభంపై స్వామి జెండా కట్టేందుకు ఎక్కినప్పుడు ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతనిని అనంతపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయుడి దాడి

గార్లదిన్నె, సెప్టెంబరు 8: మండల పరిధిలోని కోటంక గ్రామంలో టీడీపీ కార్యకర్త శ్రీనివాస్‌రెడ్డిపై వైసీపీ కార్యకర్త పరమేశ్వర్‌రెడ్డి దాడి చేసి తీవ్రంగా గాయపరిచా డు. టీడీపీ కార్యకర్త శ్రీనివాస్‌రెడ్డి, వైసీపీ కార్యకర్త పరమే శ్వర్‌రెడ్డి భూమి సమస్యపై గొడవపడ్డారు. ఈ క్రమంలో ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి తోటలో ఉండగా వైసీపీ కార్యకర్త పరమేశ్వర్‌రెడ్డి కట్టెతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో శ్రీనివాస్‌రెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైసీపీ కార్యకర్తపై ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 8: మండలంలోని చందమూరు గ్రామస్థులు వరద బాధితుల సహాయార్థం గ్రామంలో 11ప్యాకెట్ల బియ్యాన్ని సేకరించారు. వీటిని విజయవాడ వరద బాధితులకు పంపనున్నట్లు వారు తెలిపారు.



రామగిరి మండలంలోని వెంకటాపురంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే పరిటాల సునీత, కోడలు పరిటాల జ్ఞాన ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గ్రామంలో పలు వినాయక మండపాల్లో గ్రామస్థులతో కలిసి పూజలు చేశారు. -రామగిరి



అనంతపురం అర్బన్ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వినాయక మండపంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. - అనంతపురం అర్బన్

అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8: నగరంలోని చాకలి ఐలమ్మ కాలనీలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆదివారం అన్న ప్రసాదం వితరణ చేశారు. దాత తురకపల్లి రంగన్న, ఆయన కుమారుడు యశ్వంత్, ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, సీపీఐ నాయకులు లింగమయ్య, సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, సీపీఐ కాలనీ కార్యదర్శి నాగరాజు తదితరుల చేతుల మీదుగా అన్నదానం చేశారు. సమాఖ్య నగర అధ్యక్షుడు టీసీ భూషణ, నాయకులు ఆదినారాయణ, సీవీ లలిత, శర్మ, భాష, సత్యనారాయణ, సంజీవులు, లక్ష్మినారాయణ, ఓబులేసు, మారుతి, నరేష్, చిన్న సుబ్బరాయుడు, సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

11న మేళా

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 8: ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు పీఎం నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్స్ రంగాల్లోని వివిధ పరిశ్రమల్లో ఏడాది పాటు నైపుణ్య శిక్షణ ఇస్తారన్నారు. అదే సమయంలో నెలవారిగా స్టైఫండ్ చెల్లిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ జారీ చేస్తారని ఉద్యోగ నియామకాల్లో 20శాతం కోటా ఈ సర్టిఫికెట్లకు కేటాయిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 11న కళాశాలలో నిర్వహించే మేళాకు పదవ తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలతోపాటు ఎన్‌టీసీ, ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్, కులధృవీకరణ పత్రాలను మూడు జిరాక్స్ సెట్లు. పాస్‌పోటోలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్ 9063806280 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 8 : ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎంప్లాయీస్ యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి పీఎస్ ఖాన్ అధ్యక్షతన ఆదివారం ఆ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో భాగంగా కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. యూనియన్ ప్రధాన సలహాదారుగా వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా ఎస్ఎం బాషా, మాధవయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రవీంద్ర, డిపో అధ్యక్షుడిగా ఎస్‌హెచ్‌ఆర్ ఖాన్, కోశాధికారిగా వైసీఎస్ రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా ఈకే నాయక్, పీఎస్ రమాకాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ నాయకులు విశ్వనాథరెడ్డి, ఎన్ఎస్ నాయక్, డీఓ రత్నం, మల్లికార్జున, పీఎస్ఏ ఖాన్, గోపాల్, ఆదిశేష తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సత్యసాయి కార్మికుల సమ్మె

ఆత్మకూరు, గార్లదిన్నె, సెప్టెంబరు 8: సత్యసాయి తాగు నీరు సరఫరా చేసే కార్మికులు సమ్మెలో భాగంగా ఆదివారం నాలుగో రోజు ఆత్మకూరు లోని సత్యసాయి వాటర్ సప్లై పంప్ హైస్ వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఆర్నెల్లుగా తమకు జీతాలు ఇవ్వకుంటే కుటుంబ పోషణ ఎలా? అని ప్రశ్నించారు.ప్రభుత్వం వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి కార్మిక సంఘం నాయకులు ఓబన్న, చిన్న, శ్రీధర్, మల్లి, సాయి ప్రసాద్ రెడ్డి, కేశవులు, శ్రీరాములు,హరి, దివాకర్, శివ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని నార్పలలోని సత్యసాయి తాగునీటి కార్మికులు పేర్కొన్నారు. వారు చేపట్టిన సమ్మె ఆదివారానికి 18వ రోజుకు చేరింది. ఆదివారం కల్లూరు పంపుహౌస్ వద్ద నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, భాష, మల్లరాయుడు, సాంబశివ, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు



కల్లూరులో బైక్ ర్యాలీ...

పార్వతి తనయా నమోనమః

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

పల్లెలు, పట్టణాలు తేడాలేకుండా వీధివీధినా బొజ్జగణపయ్య కొలువై భక్తకోటికి కనువిందు చేశాడు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం అనంతపురం నగరంలోను, నియోజకవరగంలోను ప్రజలు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వాడవాడల్లో గణనాథుడు కొలువు దీరాడు. అయా మండపాల వద్ద ఘనంగా పూజలు నిర్వహించారు. రెండో రోజు ఆదివారం కూడా గణనాథుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మండపాల వద్ద భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో కొలువైన వినాయక విగ్రహాలను మూడో రోజైన సోమవారం సమీప చెరువుల్లో నిమజ్జన చేయనున్నట్లు ఆయా ఉత్సవకమిటీల సభ్యులు తెలిపారు. పలు ప్రాంతాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన వినాయకులు ఇలా...



పాతూరు అమ్మవారిశాలలో వినాయకుడు



కమలానగర్‌లో..



ఆర్ఎఫ్ రోడ్డు వెంకటేశ్వరాలయం ఎదుట..



శ్రీనివాసనగర్ రామాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అంబికా



మొదటి రోడ్డు రెండో క్రాస్‌లో...



రంగస్వామి నగర్‌లో...



చెరువుకట్ట మీద...



సాయినగర్ 3వ క్రాస్‌లో...




సంఘమేష్‌నగర్ పెట్రోల్ బంకు వద్ద..



ఐదో రోడ్డుబాబా ఫక్రుద్దీన్ మకానం వద్ద..



అంబేడ్కర్ నగర్‌లో...



సైపుల్లా బ్రిడ్జి వద్ద చాక్లెట్లతో..



రెండో రోడ్డులో..



శారదానగర్ శంకరమఠంలో..



బుక్కరాయసముద్రంలో పెద్దమ్మ గుడి వద్ద..



దయ్యాలకుంటపల్లిలో..



ఆర్టీసీ బస్టాండ్ వద్ద..



అరవిందనగర్‌లో పసుపుకొమ్మల వినాయకుడు



ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో...



గార్లదిన్నెలో 11వ వార్డులో...



రాప్తాడులో...



చిన్మయ్‌నగర్‌లో...



నార్పలలో...



సీకేపల్లి ఎస్సీకాలనీలో...


గుత్తి ఆర్ఎస్‌లో నెమలి ఈకల వినాయకుడు


రాయదుర్గంలో ఆంజనేయ రూపంలో..

విఘ్నరాజా.. నమోస్తుతే..

● భక్తిశ్రద్ధలతో వినాయక చవితి
● వీధివీధినా కొలువుదీరి పూజలందుకుంటున్న గణపయ్యలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: వినాయక చవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల కేంద్రాలతో పాటు అన్ని మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం ప్రజలు వేడుకలను అంగరంగవైభవంగా జరిపారు. ప్రజలు ఇళ్లల్లోనే చిన్నపాటి వినాయక విగ్రహాలను ఉంచి అలంకరణలు చేసి, నైవేద్యాలు సమర్పించి ఇంటిల్లిపాదీ ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీల నిర్వాహకులు వీధివీధినా ఏర్పాటు చేసిన మండపాల్లో పెద్ద పెద్ద విగ్రహాలను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పలు చోట్ల వివిధ ఆకృతులలో వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. పండగ సందర్భంగా పలు ఆలయాల్లో సైతం పూజలు ఘనంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో మండపాల్లో కొలువుదీరిన వినాయకులను ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. పామిడిలోని తగ్గుదేవాలయంలోని ఏర్పాటుచేసిన రామయణ ఘట్టంను కలెక్టర్ వినోద్‌కుమార్ తిలకించారు. కణేకల్లులోని చిక్కణ్ణేశ్వర ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దర్శించుకున్నారు.


గుంతకల్లులోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పంచముఖ వినాయకుడు


గుంతకల్లులోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద వెండి వినాయకుడు


ఉరవకొండలో చాక్లెట్ వినాయకుడు


రాయదుర్గంలో ఆకట్టుకుంటున్న గణేశుడు


పామిడి బెస్తవీధిలో అగరబత్తీల వినాయకుడు


పామిడిలో పండ్లతో తయారైన వినాయకుడు


తాడిపత్రిలోని విజయనగర్ కాలనీలో కాణిపాక వినాయకుడు


కళ్యాణదుర్గంలో ఎద్దులబండిపై గణనాథుడు



యాడికిలో వెలసిన బొజ్జ గణపయ్య..


బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో..


కూడేరులో..


పుట్లూరు మండలం తక్కళ్లపల్లిలో..


పెద్దవడుగూరులోని బీసీ కాలనీలో..


యల్లనూరులోని కోటవీధిలో..


పెద్దపప్పూరులో..


వజ్రకరూరులో..


బెళుగుప్పలో ..


గుత్తిమండలం గొందిపల్లిలో..

ప్రజాసంక్షేమమే కూటమి ధ్యేయం: ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, సెప్టెంబరు 8: ప్రజలకు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని హనుమాపురం, సొల్లాపురం గ్రామాలలో స్థానిక టీడీపీ నాయకులు జయరాంచౌదరి, నీలకంఠారెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు మంచి చేయాలనే తపనతో తమ పార్టీ నాయకులు ఉన్నారన్నారు. వారికి టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందించే బాధ్యత తమదేనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, ఎస్‌కే మల్లికార్జున, కళేకుర్తి సుదర్శన్, బీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


హనుమాపురంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే..

గుంతకల్లు వాసికి జాతీయ ఉపాధ్యాయ పురస్కారం

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 8: పట్టణంలోని మహబూబ్ నగర్ కాలనీకి చెందిన జయశంకర్‌బాబు ఆదివారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. జయశంకర్‌బాబు పాండిచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేస్తున్న 16 మంది అధ్యాపకులకు ఈ ఏడాది కేంద్రప్రభుత్వం ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ పురస్కారాలను ప్రకటించింది. అందులో భాగంగా జయశంకర్‌బాబు పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం పురస్కారాలు అందుకున్న అధ్యాపకులు ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు.


రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకుంటున్న జయశంకర్‌బాబు

వరద బాధితులను ఆదుకుందాం

రాయదుర్గం, సెప్టెంబరు 8: విజయవాడ ప్రాంతంలో వరదలతో అతలాకుతలమైన కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వదలచుకున్న వారు సీఎం సహాయనిధి పేరుతో చెక్కులు, డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో సహాయం చేయాలన్నారు. తన వంతుగా రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. స్వచ్ఛందంగా ఇవ్వదలచుకున్న వారు డీడీలు, చెక్కులను తమ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. వస్తురూపంలో, ఆర్థిక రూపంలో సహాయం అందించాలన్నారు.

పలువురి ఆర్థిక సాయం

డీ.హీరేహాళ్: వరద బాధితులను ఆదుకోవడం కోసం దేవాదాయ శాఖ ఈఓ నరసింహారెడ్డి రూ.21 వేలు, మురడి సచివాలయ సిబ్బంది రూ. 10 వేలు, గుడి గ్రామ పంచాయతీ తరఫున రూ. 10 వేలు, వైద్య ఆరోగ్య సిబ్బంది రూ. 10 వేలు, మురడి ఎంపీటీసీ మెంబర్ గంగాధర రూ. 5వేలు, ఆర్ఎంపీ డాక్టర్ హనుమంతరెడ్డి, రూ. 5 వేలను శనివారం ఎమ్మెల్యే శ్రీనివాసులుకు అందజేశారు. అలాగే ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని పలువురు అందజేశారు.

గుంతకల్లుటౌన్: వరద బాధితుల కోసం పట్టణంలోని శంకరానంద డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కే రామకృష్ణ నాయుడు సీఎం సహాయ నిధికి రూ. 10వేలు ఆర్థిక సాయం చేశారు. వరద బాధితులకు ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

పామిడి: వరద బాధితులకు ఆదుకునేందుకు టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ పట్టణంలో ఆదివారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్ కృష్ణ, బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు తిమ్మప్ప, షేక్షా, సాయి, నిరంజన్, పురుషోత్తం, జగన్, జనసేన రాము పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న అయ్యప్ప విగ్రహం

బెళుగుప్ప, సెప్టెంబరు 8: మండలంలోని దుద్దేకుంటలో శనివారం అయ్యప్ప స్వామి విగ్రహం పొలంలో దొరికినట్లుగా జరుగుతున్న ప్రచారం కలకలం రేపింది. కలలోకి స్వామి వచ్చి చెప్పడంతో తాను పొలంలో గుంత తవ్వి విగ్రహాన్ని బయటకు తీశానని ఓవ్యక్తి చెబుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కాగా గ్రామంలో అయ్యప్ప స్వామి కమిటీల మధ్య ఆలయం నిర్మించటానికి ఏర్పడిన విభేదాలతో ఇలా చేశారని కొందరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా విగ్రహం పొలంలో దొరకడం వింతగా ఉందని ఆశ్చర్యపోతున్నారు. నల్లరేగడి భూమిలో దొరికిందని చెబుతున్న విగ్రహం మెరుస్తోంది. రెండు రోజుల నుంచి విగ్రహం దొరికినట్లు ప్రచారం జరుగుతున్నా.. ఇంతవరకు పోలీసులు స్వాధీనం చేసుకోలేదు. ఇది వాస్తవమా, సృష్టించారా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.


భూమిలో దొరికినట్లుగా చెబుతున్న అయ్యప్పస్వామి విగ్రహం

రేషన్ షాపు ప్రారంభం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 8: మండలంలో ఉద్దేహాళ్ గ్రామంలో ఆదివారం మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్లు మహేంద్ర, నాగరాజు, టీడీపీ నాయకుడు సల్లాపురం బాబు రేషన్ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కసాపురంలో గణపతి హోమం

గుంతకల్లు, సెప్టెంబరు 8: వినాయక చవితిని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం గణపతి అధర్వశీర్ష హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ హోమశాలలో త్రయాన్హిక దీక్షలో భాగంగా రెండో రోజున వినాయక వ్రతం, అధర్వ శీర్ష హోమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ వేద పండితుడు రామకృష్ణావధాని, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

దశభుజ గణపతికి ప్రత్యేక పూజలు

రాయదుర్గం, సెప్టెంబరు 8: వినాయక చవితి సందర్భంగా పట్టణంలో ప్రసిద్ధిగాంచిన దశభు జ గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా చేశారు. ఉదయాన్నే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, అభిషేకాలు, అలంకరణలు చేపట్టి ప్రత్యేక పూజలను చేశారు. అలాగే మహా మంగళహారతి అందించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దశభుజ గణపతి ఆలయానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించి అనంతరం ఆయా మండపాల్లో కొలువుదీర్చారు.

వినాయకా.. మా బాధ ఆలకించవయ్యా..

కళ్యాణదుర్గం , సెప్టెం బరు 8 : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. కాగా శనివారం సమ్మె శిబిరం వద్ద వినాయకుడి విగ్రహానికి కార్మికులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినాయకా మా వేతనాల బాధ ఆలకించవయ్యా అంటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మా వేతన బాధలు తీరేంత వరకు ఇలాగే నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

కూడేరులో భిక్షాటన

కూడేరు: మండలకేంద్రంలో సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల కార్మికులు ఆదివారం సమస్యలు పరిష్కరించాలంటూ భిక్షాటనతో వినూత్న నిరసన చేపట్టారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని వారు తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన నాలుగో రోజు చేరింది. ఇందులో భాగంగా దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఇందుకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. తాగునీటి పథకాల కార్మికులకు పెండింగ్ వేతనాలు , పీఎఫ్‌ను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

గుత్తి, సెప్టెంబరు 8: గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని జక్కలచెరువు-రాయలచెరువు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఐదు దుకాణాల్లో చోరీకి యత్నం

గుత్తి, సెప్టెంబరు 8: గుత్తి ఆర్ఎస్‌లో ఐదు దుకాణాలలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. మెయిన్ బజారులోని జనతా షూమార్ట్ తాళాలను పగలగొట్టి షాపులో చొరబడిన దొంగలు నగదు లభించకపోవడంతో రెండు జతల చెప్పులను బయట పడేసి వెళ్లిపోయినట్లు బాధితుడు శ్రీనివాసులు తెలిపారు. అదే విధంగా జావిద్ చికెన్ సెంటర్, పక్కన ఉన్న టైలర్ షాపు తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. అక్కడా నగదు లభించకపోవడంతో వెనుదిరిగారు. మరో రెండు దుకాణాలలో చోరీకి యత్నించారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా చేసుకోండి: డీఎస్పీ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 8: పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి కోరారు. పట్టణంలోని వినాయక నిమజ్జనం ఘాట్‌ను, బందోబస్తు ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నిమజ్జనం సందర్భంగా పట్టణ ప్రజలు ట్రాఫిక్ నింబంధనలు తప్పక పాటించాలన్నారు. పెద్దవాహనాలు హనుమాన్ సర్కిల్ నుంచి పట్టణంలోనికి అనుమతించబడవు అన్నారు. సోమవారం సాయంత్రం 4గంటల నుంచి మంగళవారం ఉదయం 6గంటల వరకు ఇతర మార్గాల ద్వారా వాహనాలు వెళ్లాలన్నారు. వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు బీ మనోహర్, ఏపీ మస్తాన్, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

అనంతపురం క్రైం,సెప్టెంబరు 8: పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. మేడిమాకులపల్లికి చెందిన మూలింటి వెంకటరామిరెడ్డి కుమారుడు చంద్రశేఖర్ శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడు ఆదివారం మధ్యాహ్నం ఇంటికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పెద్దవడుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చంద్రశేఖర్

8మందిపై కేసు నమోదు

యాడికి, సెప్టెంబరు 8: రాయలచెరువులో చెట్ల తొలగింపునకు సంబంధించి 8మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. రాయలచెరువుకు చెందిన వెంకటనారాయణ సర్వేనెంబరు 258-ఏలో 150సేరేడు, 100 కొబ్బరి, 100నిమ్మచెట్లను సాగుచేశాడని , కాగా శుక్రవారం రాత్రి 8మంది వ్యక్తులు జేసీబీలతో చెట్లను తొలగించి నాశనం చేశారన్నారు. ఈ మేరకు వెంకటనారాయణ సోదరి పద్మజ ఫిర్యాదు చేయడంతో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్, మదమంచి శివప్రసాద్, చాకలి గురప్ప, బలిజ ఈశ్వరయ్య, మదమంచి రాఘవ, నెట్టికంటయ్య, హుస్సేనప్పపై కేసు నమోదుచేసినట్లు సీఐ పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల వాదన మరోలా..

వెంకటనారాయణ చెట్లు సాగుచేసిన భూమి ప్రభుత్వానిదని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్ తెలిపారు. వైసీపీ హయాంలో ఈ భూమిని ఆక్రమించారని తెలిపారు. దీనిపై గతంలో ఎన్నో సార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశామన్నారు. అయినా వారిలో స్పందన లేదన్నారు. రూ. కోట్లు విలువ జేసే భూమి అన్యాక్రాంతం కావడంతోనే తాము స్పందించామన్నారు. రెవెన్యూ అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 8: మండలంలోని బొల్లన గుడ్డం చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఉదయం అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కణేకల్లు మండలం కళేకుర్తి గ్రామానికి చెంది న ఎం ఆంజనేయులు కర్ణాటకలోని రూపనగుడి నుంచి 768 టెట్రా ప్యాకెట్లను బైక్‌లో తరలిస్తుండగా.. పట్టుకున్నామని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. అనంతరం మద్యంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఆంజనేయులును అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి, సెప్టెంబరు 8: మండలకేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శ్రీరంగ అనే వ్యక్తిని శనివారం అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 20మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ ఈరన్న తెలిపారు. కోటవీధికి చెందిన శ్రీరంగ కుంటవీధిలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందిందని, వెంటనే సిబ్బందితో దాడిచేసి మద్యంబాటిళ్లను సీజ్‌చేసి అతడిపై కేసు నమోదుచేసినట్లు సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

తాడిపత్రి, సెప్టెంబరు 8: పట్టణంలోని మెయిన్‌బజారుకు చెందిన విద్యార్థి ఆదిల్ (14) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని పట్టణ పోలీసులు తెలిపారు. మెయిన్‌బజారుకు చెందిన సాధక్ వలి కుమారుడు ఆదిల్ స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగురోజులక్రితం స్కూటీలో ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో పాతమున్సిపల్ కార్యాలయం సమీపంలో వెనుక వైపు నుంచి బొలెరో వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి మృతికి ఎమ్మెల్యే నివాళి

గుమ్మఘట్ట, సెప్టెంబరు 8: ఆత్మకూరు వద్ద హత్యకు గురైన మండలంలోని శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన యువతి సరిత మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యుల్ని ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబసభ్యులకు క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న రూ. 15 వేలు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పుట్లూరు, సెప్టెంబరు 8: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామశివారులో ఆదివారం పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.2430 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామని, పేకాటాడుతున్న నలుగురి అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

పెట్రోల్ బంక్‌లో చోరీ

పెద్దవడుగూరు, సెప్టెంబరు 8: మండలంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఆఫీస్‌రూంలోకి చొరబడి రూ.8900 నగదు అపహరించాడని ఎస్ఐ రెడ్డప్ప తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

సీఐగా యుగంధర్ బాధ్యతలు

పామిడి, సెప్టెంబరు 8: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐగా వీ యుగంధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి అనంతపురం వీఆర్‌కు బదిలీ అయ్యారు.

మహిళ ఆత్మహత్య

కళ్యాణదుర్గం (కంబదూరు), సెప్టెంబరు 8: మండలంలోని నూతిమడుగు గ్రామంలో కంసల హారిక (22) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి శివమ్మ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నూతిమడుగుకు చెందిన మహేష్‌నాయక్‌తో అదే గ్రామానికి చెందిన కంసల హారికకు మూడేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇంకా పిల్లలు లేరు. హారిక నిత్యం కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుంది. కొద్దిసేపటికి తల్లి వచ్చి చూడగా.. ఉరికి వేళాడుతూ కనిపించింది. వెంటనే ఆమె కుటుంబసభ్యుల సాయంతో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించారు.

గుండెపోటుతో సీపీఐ నాయకుడి మృతి

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 8: రాయదుర్గం పట్టణానికి సీపీఐ సహాయ కార్యదర్శి గురుస్వామి(55) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయన వ్యక్తిగత పనిమీద ఇంటి నుంచి బజారుకు బైక్‌పై వచ్చారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా బళ్లారి బస్టాండ్ వద్ద ఒక్కసారిగా కుప్పకూలాడు. స్థానికులు గమనించేసరికి అప్పటికే మృతి చెందాడు. సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ. 5600 ఆర్థిక సాయం అందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 8: మండలంలోని బొల్లనగుడ్డం శివారులోని వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా మూడు ట్రాక్టర్లను ఆదివారం సిబ్బందితో కలిసి పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. అనంతరం వాటి యజమానులైన కళ్లహోళకు చెందిన వైసీపీ నాయకులు వీరన్నగౌడ్, సంగప్ప, బొల్లనగుడ్డం గ్రామస్థుడైన వెంకటేశ్‌తోపాటు డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

ఉరవకొండ, సెప్టెంబరు 8: వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆదివారం సాయంత్రం తాగునీటి కోసం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉరవకొండ- గుంతకల్లు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పలువురు మాట్లాడుతూ సత్యసాయి నీటిపథకం కార్మికులు సమ్మెలో ఉండడంతో తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగు నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. కొద్దిసేపటికి పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలపడంతో వారు ఆందోళన విరమించారు.

పలు ఆలయాల్లో కలెక్టర్ పూజలు

పామిడి, సెప్టెంబరు 8: పట్టణంలోని భోగేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, లక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా భోగేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేపట్టారు. ఆలయ నిర్మాణాలను పరిశీలించారు. ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. తర్వాత స్వామి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదించారు. అనంతరం చెన్నకేశవస్వామి, లక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో స్వామిర్లను దర్శించి పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వదించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, వీఆర్వో శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


కలెక్టర్‌కు భోగేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అర్చకులు